# ఖైదీ

## సీరియల్

### పదిహేనవ భాగము

"కాదు! ఇతను!" అంటూ నా ప్రక్కకున్న నాయకుణ్ణి చూపించాను.

"నీదే దేశం?" అడిగాడు కెప్టెన్ నన్ను.

"ఇండియా!"

"వీళ్ళలో కెలా చేరావ్?"

నాకథ టూకీగా చెప్పాను. నా మాటల్ని అర్థంచేసుకునేందుకు ప్రయత్నిస్తూ, ఓపిగ్గా నాయకుడు వినడం గమనించాను.

"నా వెంట వస్తావా? మీదేశం చేరుస్తాను!" అన్నాడు కెప్టెన్.

డెల్లా విషయం చెప్పి, ప్రస్తుతం నేనటువంటి ప్రయత్నంలో లేనని చెప్పాను.

నన్ను వెంటతీసుకెళ్ళి కావలసిన సామగ్రి అంతా చూపించి తీసుకోమన్నాడు. నాయకుడు నన్ను అంటి పెట్టుకునేవాడు. మా అనుచరుల్ని పురమాయించి, విస్కీ సీసాలు, సిగరెట్లు, సబ్బులు, ఉడకబెట్టిన కోడిగుడ్లు మొదలైనవన్నీ గోతాల్లో వేయించి కట్టించాం.

మేము ముగ్గురం కెప్టెన్ రూంలో చేరి విస్కీ తాగడం మొదలెట్టాం. మావాళ్ళు దోచుకున్న సరుకంతా డింగీల లోకి చేర్చడం మొదలెట్టారు.

దాదాపు నాలుగుగంటలపైనే వున్నాం స్టీమరులో.

తమ స్టీమరు ఆస్ట్రేలియా వెళుతుందనీ, సూయజ్ కాలువ మూసివేయడంవల్ల, రూట్ మార్చుకుని రావలసి వచ్చిందనీ చెప్పాడు. త్వరలో సూయజ్ కాలువ తెరచేం దుకు ఏర్పాట్లు జరుగుతున్నాయనీ, అది జరిగాక, ఏరక మైన స్టీమరూ ఈ దారివెంట రాదనీ కూడా చెప్పాడు కెప్టెన్. అతని ఉద్దేశ్యం, నేను నా దేశం చేరేందుకు ఇంతకు మించి మంచి అవకాశం లేదని నొక్కి చెప్పడమే ననిపించింది నాకు.

డింగీలు నీళ్ళల్లో మునిగిపోయేంత బరువుగా సామా నులు ఎక్కించారు అడవిమనుషులు. నేనూ నాయకుడూ కెప్టెన్‌వద్ద శెలవుపుచ్చుకుని, డెక్‌పైనుండి, కొండపైకి దూకి, మా డింగీ జేరుకున్నాం.

తెల్లవారబోతున్నట్లు చీకటి పల్చబడి తెల్లటి తెరలు కనుపించాయి.

సిగరెట్ ముట్టించి దమ్ములాగాను. పొగ గుండెలకు తగిలింది. ఆనందం కలిగింది. నాయకుడు కూడా సిగ రెట్ అడిగి తీసుకొని ముట్టించాడు. ఎలా పీల్చాలో,

ఎలా పొగవదలాలో అతనికి వివరించి, రెండుసార్లు చేసి చూపించాను. అతనూ మొదలు పెట్టాడు.

"ఇవాళనాకు చాలా ఆనందంగావుంది!" అన్నాడు నాయకుడు.

"ఎందుకు?" అడిగాను.

"ఏవిధమైన రక్తపాతం లేకుండా, జననష్టం కాకుండా, వచ్చినపని సులభంగా ముగించినందుకు."

"ఇది సామాను చేరవేసే నౌక. ఇందులో ప్రయాణీకులుండరు. కేవలం ఓడ నడిపించేందుకు అవసరమయిన పనివాళ్ళు మాత్రమే వుంటారు. అందువల్ల సులభంగా మనపని జరిగిపోయింది." అన్నాను.

నువ్వు నావెంట వుండే అన్నీ జయప్రదంగా జరుగుతాయన్న నమ్మకం వుందినాకు. డెల్లాసాకుతో నువ్వు వెనుకంజ వేసినా పట్టుబట్టి తీసుకొచ్చిందందుకే!! అన్నాడు.

అరగంట తర్వాత డింగీలు సముద్రపు ఒడ్డుకు చేరుకున్నాయి.

రెండు విస్కీ బాటిల్స్, కొన్ని సిగరెట్లు, సబ్బులు తీసుకున్నాను. నాయకుడు నన్ను వెళ్ళిపొమ్మన్నాడు. వడివడిగా అడుగులు వేసుకుంటూ వెళ్ళాను మా కుటీరం వైపు.

నే వెళ్ళేసరికి డెల్లా నిద్రపోతుంది. లోనికి వెళ్ళి లేపాను. కళ్ళుమూసుకొని లేచి కూర్చుంది నన్ను చూడగానే ఆనందంతో అమాంతం కౌగలించుకుంది.

మెల్లగా ఆమెను పట్టువదలించి "ఎందుకలా భయపడావ్?" అడిగాను.

"నువ్వు క్షేమంగా తిరిగి వస్తావని అనుకోలేదు. నాగతి ఏమిటో, ఏమవుతుందోనని భయపడుతూ కూర్చు న్నాను!" అంది డెల్లా.

"వచ్చేశాగా! భయపడడం ఎందుకు? నీ కోసం విస్కీ సిగరెట్లు, సబ్బులు తెచ్చాను," చూపించాను.

ఇద్దరం వెలుపలికొచ్చి కూర్చున్నాం.

విస్కీ త్రాగుతూ, సిగరెట్లు కాల్చుకుంటూ, రాత్రి జరిగిన దొంగతనం గురించి మాట్లాడుకున్నాం. అంతా అయ్యాక సూయజ్ కాలువ గురించి స్టీమర్ కేప్టెన్ చెప్పిన వివరాలు కూడా చెప్పాను.

"అయితే మనం ఇక్కడ్నుంచి ఈ జన్మకు తప్పించు కునే మార్గం లేదన్నమాట!" అంది డెల్లా.

"ఎందుకలా అనుకుంటావ్?"

"కనీసం అక్కడికెళ్ళి కాపలా కాస్తూవుంటే ఏదైనా స్టీమరు వస్తుందన్న ఆశ వుండేది ఇందాక. ఇప్పుడదీ లేదంటున్నావు. ఎలా తప్పించుకోవాలో తప్పించుకున్నా ఎలా ముందుకు పోతాం!" నిరాశ, నిస్పృహ ధ్వనిం చాయి ఆమె గొంతులో.

ఆమె మాట నిజమే. మరేదో విచిత్రం జరిగితే తప్ప, ప్రస్తుతపు పరిస్థితుల్లో ఇక్కడ్నుంచి తప్పించుకునే దారి లేకనే యీ బందీ నాక్కూడా. కాని ఆ మాట ఆమెకు చెప్పి. ఇంకా నిరాశ పరచడం ఇష్టం లేకపోయింది.

ఆ రోజంతా త్రాగటం, తినటంతోనే గడచిపోయింది మా ఇద్దరికీ.

చీకటి పడుతూండగా, ఓమారు గూడెందాకా వెళ్ళివస్తే బాగుండు ననిపించింది. డెల్లాతో చెప్పాను. వెళ్ళి

తొందరగా వచ్చెయ్యమంది. గంటలోగా తిరిగి వస్తానని చెప్పి బయలుదేరాను.

నిర్మానుష్యమైన ఆ ప్రదేశం, అడవి, చెట్లు నాగరికత లేని మనుషులు, వీటిమధ్య చిక్కుపడిపోయిన జీవితం, తలచుకుంటూ అడుగులో అడుగు వేసుకుంటూ పోతున్నాను.

వెనుకనుండి ఎవరో పిలిచినట్లు తోచింది.

తిరిగి చూశాను. చీకట్లో చెట్టుమొదట్లో నిలుచుని వుంది అంతకు ముందురోజు రాత్రి బలవంతంగా నా చేత ఆనందం పొందిన ఆడమనిషి. చూడగానే బిక్కచచ్చిపోయాను. అడుగు ముందుకు పడలేదు, వెనక్కి రాలేదు.

దగ్గరకు రమ్మన్నట్లు సైగ చేసింది.

యాంత్రికంగా వెళ్ళాను.

"చీకట్లో ఇక్కడున్నావ్ ? ఎందుకు ?" అడిగాను తెలిసినా తెలియనట్లు నటిస్తూ.

"ఇంకెందుకు ? నువ్వీ త్రోవన గూడెం వెళ్ళావని తెలుసుగా. కాచుకుని కూర్చున్నాను." అంది నవ్వుతూ.

"అదే ఎందుకు ?" అడిగాను."

"నువ్వంటే నాకిష్టం ! రాత్రిసుఖం మరచిపోలేకపోతున్నాను. మళ్ళీ కావాలనిపించింది. సాయంత్రమే వచ్చేశాను" అంది.

చుట్టూ చూశాను భయంగా. ఎవరైనా మమ్మల్ని గమనిస్తున్నారేమోనని. ఎవ్వరూ కనిపించలేదు.

"ఏంటలా దిక్కులు చూస్తున్నావ్ ?" అడిగిందామె.

"ఎవరన్నా మనల్ని గమనిస్తున్నారేమోనని..." అన్నాను,

"ఎవరూ లేరు ! నేను రహస్యంగా వచ్చేశాను," అంది ఆమె.

నాకెటూ పాలుపోలేదు. ముందురోజే ఆమె కోరిక తీర్చకుండా వెళ్ళిపోయి వుండాల్సిందనిపించింది. కానీ ఇప్పుడనుకొని లాభంలేదు. చేతులు పూర్తిగా కాల్చుకున్నట్లయింది.

"నువ్విలా నా వెంటబడటం బాగాలేదు ! గూడెంలో వాళ్ళు ఎవరైనా చూస్తే నిన్నూ నన్నూ, నిలువునా నరికి పారేస్తారు. వెళ్ళిపో !" అన్నాను.

"వెళ్ళను. అటు వెళ్ళటంకన్నా నాకు చావే నయం!" అంది.

"నీ సంగతి సరే ! నాకు భార్యవుంది. ఆమె నేను లేకుంటే బ్రతకదు. అనవసరంగా నన్ను ఈ గొడవల్లోకి లాగవద్దు వెళ్ళిపో !" అన్నాను.

"నా సంగతి నీకు బాగా తెలుసు ! నిన్ననే చెప్పాను నేను ఎటువంటి దాన్నో ! పదే పదే మారిపోయే మనిషిని కాను నేను. నన్ను తృప్తిపరచడం నీ విధి. నువ్వు కాదంటే, నీమీద ఎలా పగతీర్చుకోవాలో నాకు బాగా తెలుసు. నా కోరిక తీరుస్తూ వున్నన్నిరోజులు నీకే విధమైన లోటు రాకుండా, ప్రమాదం లేకుండా చూచే పూచీ నాది ! దా ! అంటూ చేతులు చాపింది.

అదక త్తెరలో చిక్కుకున్న పోకలాగుంది నా పరిస్థితి. ఆమెను మళ్ళీ అనుభవించడం, అది అదనుగా, రోజూ ఆమె కాపలాకాస్తూ ఇక్కడ కూర్చోవడం, ఎవరికంటనో పడడం, నా కిష్టంలేదు. ఏమైనా ఆమెను వదిలించుకోవాలని గట్టి నిర్ణయం తీసుకున్నాను. ఆమెవల్ల ముందు

ముందు ఏ విధమైన ప్రమాదం రాకుండా వుండేందుకు తగిన వ్యూహంకోసం ఆలోచిస్తూ నిలుచున్నాను.

ఆమె మాత్రం, నవ్వుతూ, క్రింది పెదవిని, పై పంటితో కొరుకుతూ ఆవేశంగా, ఉద్రేకంగా ఉప్పొంగి పోతున్న హృదయంతో, నుంచునే వుంది నా ముందు.

"ఏమిటలా ఎటో చూస్తూ ఆలోచిన్నావ్?" అడిగింది.

"ఏంలేదు. మా నాయకుడు రమ్మని కబురు పంపాడు నా కోసం. ఎదురు చూస్తూవుంటాడు. నేను త్వరగా వెళ్ళకుంటే ఎదురొచ్చినా వస్తాడు. అందుకని నువ్వు ఇక్కడే వుండు. నేను వెళ్ళి త్వరగా వచ్చేస్తాను. అన్నాను.

"ఇప్పటికే నేనొచ్చి చాలా సేపయింది. ఇంకా ఎంత సేపు ఆగేది?" అంది అయిష్టంగా.

"అవును. నీ కోరిక తీరాలంటే నా మాట విని తీరాలి" అన్నాను మొండిగా.

ఆమె మాట్లాడకుండా తల వంచుకొని ఆలోచించు కొంటున్నట్లుగా అనిపించింది. "సరే" త్వరగా వచ్చెయ్! అంది చివరకు.

ఆమె అలా అనుమతించగానే నా గుండెలపైనున్న పెద్ద బండ క్రిందకు దిగినట్లుయింది. వడి వడిగా అడుగులు వేసుకుంటూ గూడెం వైపు కెళ్ళాను. ఈ గొడవ లోంచి బైట పడేందుకు నాయకుడి సాయం, సలహా అవసరమనిపించింది. అతనితో జరిగింది చెప్పాలను కొన్నాను.

నెవెళ్ళే సరికి నాయకుడు మందు ముందెట్టుకుని కూర్చున్నాడు. నన్ను చూడగానే ఆనందంగా "రా! రా. నీ గురించే ఆలోచిస్తున్నాను." అన్నాడు.

"ఎలా వుంది నీ పెట్ట? అడిగాడు డెల్లా గురించి

"బాగుంది."

"నువ్వు తీసుకో మందు" అంటూ బాటిల్ తోశాడు ముందుకు.

"వద్దు!" అంటూ అతని ముందుకు జరిపాను.

"ఏం!" అలాగున్నావ్! ఏమయింది. చెప్పు, నీ సంతోషంకోసం ఏమయినా చేస్తాను. సందేహించకు." అన్నాడు నాయకుడు.

నాకు కాస్త ధైర్యం వచ్చింది. అంత దాకా చెప్ప దమా, మానడమా అన్న మీమాంసతోనే ఉన్నానునేను.

'మీ మురాల్లో, నాయకుడికి తెలియకుండా. గుంపు లోని ఆడమనిషి మరో గుంపులోని మగమనిషితో సంబంధం పెట్టుకొన్నట్లు రుజువయితే ఏంచేస్తారు?" అడిగాను.

"అంతకన్నా పెద్దనేర మరేదీలేదు. ఇద్దర్నీ మా దేవత ముందు నిలపెట్టి, కత్తితో నిలువున నరికేస్తాను. అయినా నువ్వెందుకడుగుతున్నావు ఈ విషయం."

"అవసరం వచ్చింది"

"ఎవడికి?"

"నాకే!"

"నీకా? నిజంగానా?' ఆశ్చర్యం. భయం, ఆతృత లతో అడిగాడు నాయకుడు,

"అవును! నాకే!" అంటూ అంతకు ముందు రోజు జరిగిన సంఘటన వివరంగా చెప్పాను. ఇప్పుడు రాబోయే ముందు ఆమె ఎలా దారికాచి అడ్డగించిందీ, ఆమెనెలా మత్య్ర పుచ్చి వచ్చిందీ కూడా చెప్పాను.

నాయకుడు అంతావిని "ఆమె మన గుంపులోని

మనిషా?" అడిగాడు.

"కానట్టుంది" అన్నాను.

"నువ్వు తిరిగి వెళ్లేదాకా ఆమె అక్కడే వుంటుందా?"

"వుంటుందనుకుంటాను" అన్నాను.

నాయకుడు త్రాగుతూనే ఏదో ఆలోచించసాగాడు. కొంతసేపయినతర్వాత "నేనూ నీవెంట వస్తాను. ఇంటి దగ్గర వదలిపెడతాను. ఆమె నీకోసం కాచుకునివున్నా, నన్ను చూడగానే పారిపోతుంది. దాంతో ఇవాల్టి గండం గడిచిపోయినట్లే. రేపు నువ్వు గూడెంవచ్చేలోగా వాళ్ళ నాయకుడిగా రహస్యంగా కబురుపంపుతాను. అతను ఆమెను కనిపెట్టి వుంటాడు. ఆమె నిన్ను కలుసుకొనే ప్రయత్నం చేసిందంటే పట్టుబడిపోతుంది." చెప్పాడు.

నాయకుడి పథకం భేషుగ్గా వుందనిపించింది.

"ఆమె పట్టుబడితే ఏంచేస్తారు?"

"చంపేస్తారు!"

ఆ మాట వినగానే నాకు బాధకలిగింది. ఆమె చావుకు నేను కారణం కావడం తలచుకొంటేనే భయంపుట్టింది.

"ఆమెకు శిక్షపడకుండా, తప్పించే ఆలోచన చేయ గూడదూ..." అన్నాను.

"ఏం! నిన్ను నిన్న బాగా సుఖపెట్టిందా! ఒక్కరోజులో ఆమెపైన ఇంత ప్రేమ పుట్టుకొచ్చిందేం. మీలోలాగా, మాలో వుండదు. ఆడవాళ్ళు - మొత్తం గూడెం ఆస్తి. ఎవరి సుఖం వాళ్ళు చూసుకోవడం స్వార్థం. అదే పనికి రాదు మాకు. ఆమె తప్పుచెయ్యకున్నా, ఆమె మనస్సు లోకి తప్పుడు ఆలోచన రావడం చాలు శిక్షార్హురాలు కావడానికి. ఈ గొడవలో ఆమెకు చావు తప్పదనుకుం టాను." అన్నాడు నాయకుడు. ( సశేషం )